అంతర్జాతీయ ఖోఖో పోటీలకు శివానాయక్

• అభినందించిన మాజీ మంత్రి కేటీఆర్ • గిరిజన బిడ్డ ఎంపికవ్వడం హర్షణీయం



శివానానయక్‌ను అభినందిస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: క్రీడాకారులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. బాగ్‌లింగంపల్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూంలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ దేవేందర్‌నాయక్ కుమారుడు జరుపుల శివానాయక్ వరల్డ్ కోకో పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆధ్వర్యంలో శివానాయక్ కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన గిరిజన బిడ్డ శివానాయక్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. శివానాయక్‌ను తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. శివానాయక్ తండ్రి దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠాగోపాల్ సహకారంతో నేడు తన కుమారుడు వరల్డ్ కోకో పోటీలకు ఎంపికయ్యాడని సంతోషం వ్యక్తం చేశారు. సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు వడిత్య కళ్యాణ్ నాయక్, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు సన్మార్గం వైపు నడిపిస్తాయి

• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి • ఘనంగా భగవాన్ శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకలు
• సత్యసాయి జన్మదిన శుభాకాంక్షల లేఖను పంపించిన ప్రధాని మోదీ





సత్యసాయి జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ప్రసాదం అందజేస్తున్న సత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ ప్రతినిధులు

నల్లకుంట: భగవాన్ శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకలు శనివారం సాయంత్రం నల్లకుంట శివం మందిరంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి పొద్దుపోయాక ఈ వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ముందుగా సత్యసాయి బాబా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా పంపించిన సత్య సాయిబాబాకు జన్మదిన శుభాకాంక్షల లేఖను శ్రీసత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా ప్రతినిధులకు అందజేసిన కేంద్ర మంత్రి మాట్లాడారు.

◆ నిస్వార్థ సేవలు, ఆధ్యాత్మిక బోధనలతో సత్యసాయి మానవాళిని సన్మార్గం వైపు పయనింపజేసేందుకు కృషి చేశారని కొనియాడారు. మానవ సేవే మాధవ సేవ అని బోధించిన సత్యసాయి బాబా మానవాళిని సేవా మార్గం వైపు నడిపించారని అన్నారు. ప్రపంచంలోని 120 దేశాల్లో సత్యసాయి సేవా సంస్థల ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలతో ఎందరో అభాగ్యులకు మేలు జరుగుతోందని చెప్పారు. సత్యసాయి ఆశయ సాధనలో భాగంగా సత్యసాయి ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవన్నారు.

◆ అనంతరం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ. మల్లేశ్వర రావు మాట్లాడుతూ.. సత్యసాయి తన ప్రేమతత్వంతో భక్తకోటిని ఆదరించారని అన్నారు. ఆయన చూపిన మార్గం మానవాళికి సన్మార్గమని అన్నారు. సత్యసాయి ఖ్యాతిని ఖండాంతరాలకు చాటేలా వచ్చే ఏడాది శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ప్రసాదం అందజేశారు. ఈ వేడుకల్లో సత్య సాయి సేవా ట్రస్టు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ హెచ్‌జే. దొర తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా అశోక్‌నగర్ కార్తీక వనభోజనాలు



దీపాలు వెలిగించి వనభోజనాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్, సభ్యులు

చిక్కడపల్లి: కార్తీక మాసం సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, అసోసియేషన్ కార్యదర్శి బి.సూర్యప్రకాష్, ప్రతినిధులు ప్రభాకర్‌యాదవ్, పద్మావతి, నాగలక్ష్మి, పద్మసూర్యప్రకాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్



కవాడిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన 116వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని దోమలగూడ గగన్‌మహల్‌లో బీజేపీ కార్యకర్తలు విన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జి. వెంకటేష్, లింగంగౌడ్, రంజిత్, గణేష్, సాయితేజ యాదవ్, సుదాంష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ బంధువుల అభ్యున్నతే లక్ష్యం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్



నల్లకుంట: చాత్తాద శ్రీవైష్ణవ బంధువుల అభ్యున్నతికి చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నిరంతరం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం నల్లకుంటలోని నర్మదా భవన్‌లో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర సర్వ సభ్య సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ఎజెండా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసి సత్యనారాయణ సంఘం అభివృద్ధికై అవసరమైన పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. సంఘం నిధులతో వెంటనే చాత్తాద భవన నిర్మాణ పనులు ప్రారంభించాలనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఆర్‌సీఎఫ్ ట్రస్టు చైర్మన్ మాచవరం వెంకటేశ్వర్లు, సినీ నిర్మాత సాయి వెంకట్ మాట్లాడారు. అనంతరం సంఘం పూర్వ అధ్యక్షురాలు పద్మావతి, విశ్రాంత ఎస్పీ వింజామరం నారాయణ, తిరుక్కోవళూరు వెంకటస్వామి, నరసింహ స్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి తిరుక్కోవళూరు కృష్ణస్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం కార్యవర్గ సమావేశానికి హాజరైన సంఘం కార్యవర్గ సభ్యులు

లాల్‌కృష్ణకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి



కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కాచిగూడ: రజక సామాజిక వర్గానికి చెందిన వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లాల్ కృష్ణకు ప్రభుత్వ నామినేటెడ్ పదవి ఇవ్వాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలో ఆల్ ఇండియా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శామీర్‌పేట రాజేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రఘుపతితో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా గత 30 సంవత్సరాలుగా లాల్ కృష్ణ పార్టీ అభివృద్ధి కోసం సైనికుడిగా పనిచేస్తున్నారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి తగిన విధంగా ప్రభుత్వ నామినెటెడ్ పదవి ఇవ్వాలని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన లాల్‌కృష్ణకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని రాజ్‌కుమార్ కోరారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



బాలప్పబాడలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: బాలప్పబాడ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కార్పొరేటర్ కన్నె ఉమా పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. నాణ్యత లోపిస్తే ప్రజలు తిరగబడతారని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, భీమ్‌యాదవ్, సురేష్, భీమ్‌రాజ్, రాధిక, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఓటరు నమోదు



ఓటరు నమోదును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ శాంతారావు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ఆదివారం స్థానిక పోలింగ్ బూత్‌లలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు నమోదు ప్రక్రియను ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ శాంతారావు అన్నారు. ఆదివారం వివిధ ప్రాంతాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరు నమోదు చేసుకోగా, పేరు, చిరునామా, తప్పొలను సవరించారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన వంశీకృష్ణ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో తిరుపతిలో ఎక్కి కాచిగూడకు వస్తున్నాడు. రైలు ఉందానగర్ వద్దకు రాగానే చూసుకునే సరికి తన ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్, రూ.500 నగదు, చార్జర్ ఉంది. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఇంట్లో రాజ్యాంగం ఉండాలి



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న అడ్వొకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్

కాచిగూడ: భారత రాజ్యాంగం అత్యంత పవిత్రమైన గ్రంథమని ప్రతి నివాసంలో ఇది ఉండాలని సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ హెచ్‌సీ ఉపాధ్యాయ అన్నారు. భారతదేశం, రాష్ట్రాలు రాజ్యాంగంకు లోబడి నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగం ప్రజలకు జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించాయని అన్నారు. దక్షిణ భారత న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జేఏసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగంపై ఆయన అవగాహన కల్పించారు. జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ మాట్లాడుతూ... ఇంటింటికి రాజ్యాంగం అనే నినాదంతో గత అనేక సంవత్సరాలుగా రాజ్యాంగంపై అవగాహన చైతన్య శిక్షణా శిబిరం ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటిలో భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఎలా ఉంటుందో అదే విధంగా ప్రతి ఒంట్లో రాజ్యాంగం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు భూపాల్ రాజ్, సుదర్శన్, రామచంద్రారెడ్డి, రామ్‌కిషోర్, సతీష్, ప్రవళ్లిక, మూర్తి, బాలేశం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సీపీఐ జాతీయ సభ్యురాలు పశ్య పద్మ



నారాయణగూడలో జరిగిన సమావేశంలో పశ్యపద్మ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకురాలు పశ్యపద్మ పిలుపునిచ్చారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఉస్తెల సృజన అధ్యక్షతన ఆదివారం నారాయణగూడలో జరిగింది. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ.. మనువాద భావాలను వ్యాప్తితో భారత మహిళలను మధ్య యుగాల నాటి బుజు పట్టిన, కాలం చెల్లిన ఆలోచనల విషయవలంలోకి నెట్టడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఖండించారు. మహిళలు రోజూ అనేక రూపాలలో అవమానాలకు గురవుతున్నా మహిళా చట్టాలను సక్రమంగా త్వరితగతిన అమలు చేయడానికి చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్ పావని, నేదునూరి జ్యోతి, మండ సదాలక్ష్మి, ఎస్.ఛాయాదేవి, ఎం.నళినిరెడ్డి, బండి జంగమ్మ, లతాదేవి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాపై చర్యలు తీసుకోవాలి

అధికారులకు స్థానికుల ఫిర్యాదు



రోడ్డు కోసం వదిలిన స్థలంలో చేపడుతున్న పనులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయం వెనుక వీధిలో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ మహ్మద్ ఖాదర్ మోహియుద్దీన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, కార్పొరేటర్ సునీతాప్రకాశ్‌గౌడ్‌కు స్థానికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇంటి నం. 1–9–62/2ఏ ఎదురుగా ఉన్న ఓ ఇంటి యజమాని కొంత కాలం క్రితం ఇంటి నిర్మాణం కోసం రోడ్డు స్థలాన్ని వదిలి ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. అప్పుడు వదిలిపెట్టిన రోడ్డు స్థలాన్ని ఆక్రమించేందుకు నిర్మాణ పనులు ఆదివారం చేపట్టారు. దీంతో స్థానికులు రోడ్డు స్థలంలో నిర్మాణం చేయవద్దని విన్నవించిన పట్టించుకోకుండా అక్రమణ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణం వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో వదిలిపెట్టిన స్థలంలో రోడ్డు స్థలంలో తిరిగి నిర్మాణ పనులు చేపట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్, డీఎంసీలు స్పందిస్తూ రోడ్డు ఆక్రమణపై వెంటనే చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.

సభ్యత్వ నమోదు గడువు తేదీ పొడిగింపు

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు గడువు ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. సొసైటీలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఈనెల 25 కాగా శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు అయినందున చాలా మంది డీడీలు తీయలేకపోయినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మరో మూడు రోజులు పొడిగించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర నష్టం

రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అవకాశాలు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారని రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి జాతీయ కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల అంశంపై రైండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దాసు సురేష్ మాట్లాడుతూ... రిజర్వేషన్ల ద్వారానే వెనకబడిన వర్గాలకు అవకాశాలు దక్కుతున్నాయని అన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయడమే పట్టించుకోని పాలకులు రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ రిజర్వేషన్ల అమలు అధికారం ఆయా రాష్ట్రాలకు ఉందన్నారు. అయితే తమిళనాడు, బిహార్ రాష్ట్రాలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడం లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేసేందుకు జీవో 26ను తీసుకొచ్చిందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమం పోస్టర్‌ను ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్, డాక్టర్ దాసరి ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎ.రాంచంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కట్టా సత్య ప్రసాద్ రచనలో జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన 'దాచేస్తే దాగని సత్యం జీవ పరిణామం' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు.

మాలల సత్తా చూపాలి

పంజగుట్ట: డిసెంబర్ 1వ తేదీన జింఖానా గ్రౌండ్స్‌లో జరగనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేసి మాలల సత్తా చూపాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య కోరారు. ఆదివారం బాలాపూర బస్తీలో సింహగర్జన పోస్టర్‌ను రాజు ఉస్తాద్, పత్తి ప్రవీణ్, రావుల విజయ్ కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉండడం చూసి ఓర్వలేని కొన్ని రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు చూస్తున్నారన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి: బీసీ దళ్

లిబర్టీ: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకపోతే బీసీలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ సోమవారం నుంచి పార్లమెంటు ఉభయ సభలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఉందన్నారు. రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని అనేక సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా బీసీలు వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నప్పటికీ అధికారంలో ఉన్న పాలకులు బిల్లుకు ఆమోదముద్ర వేయలేకపోయిందని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టకపోతే గల్లీస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు సమరశంఖం పూరిస్తారని ఆయన హెచ్చరించారు.

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు'

కాచిగూడ: సీఎం రేవంత్ రెడ్డిని నియంత అంటూ విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదని, వారి హయాంలో జరిగిన నిర్బంధాలను ఒకసారి గుర్తు చేసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రైతుల కోసం పోరాటాలు చేస్తున్నాడని కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు. సీతారామపురం హయతాబాద్ భూముల విషయంలో, అసైన్డ్ భూముల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం ఎకరానికి రూ.21 లక్షలు భూపరిహారం ఇస్తే అందులో సగం డబ్బును 'పట్నం పన్ను' కింద దండుకున్నారని ఆరోపించారు.

స్వామియే శరణం అయ్యప్ప

కవాడిగూడ: భాగ్యలక్ష్మినగర్‌లో ఆదివారం బీఆర్ఎస్ కవాడిగూడ అధ్యక్షుడు పేరుస్వామి వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ జరిగింది. అయ్యప్ప నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పడిపూజకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, శ్రీనివాస్‌యాదవ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మల్లికార్జున్ పంతులు, శ్రీనివాస్‌రావు, దుర్గస్వామి, వల్లాల రవియాదవ్, సత్యనారాయణ, ముఖేష్, వేణుయాదవ్, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.



అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తలసాని, ముఠాగోపాల్ తదితరులు

శ్రీరామ, శివనామ పత్రాలను అందజేస్తున్న ఆంజనేయులు తదితరులు



చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాలి

ముషీరాబాద్: విద్యతో పాటు చిన్ననాటి నుంచే చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించాలని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలి కాలనీలో కర్ణాటకకు చెందిన శృంగేరి మఠం ఆధ్వర్యంలో శ్రీరామ, శివనామ పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావనలో ఉన్నప్పుడు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పెద్దలతో పాటు చిన్నారులు ప్రతి రోజు భక్తిభావంతో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుందర్‌పటాలే, సుజాత, శృంగేరి మఠం ప్రతినిధి భరత్‌రెడ్డి, మహేష్, రుషి, నిహార్, రేవంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



బాలత్రిపురసుందరీదేవి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దోమలగూడ అడ్వకేట్స్ కాలనీ బాలత్రిపురసుందరీ దేవి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో కార్పొరేటర్ రచనశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసంలో ప్రతిరోజు దీపాలు వెలిగిస్తే ఆధ్యాత్మిక భావాలు పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, బస్తీ నాయకులు ప్రేమ్‌కుమార్, ఆలయ అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సత్యనారాయణస్వామి వ్రతం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలను అందజేశారు.